జీఎంఆర్ ఏరో అకాడమిలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రాం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలోని జీఎంఆర్ ఏరో అకాడమిలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రాంను ప్రారంభించినట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ ఇన్ ఎయిర్‌పోర్టు, ఎయిర్‌లైన్స్ అండ్ కార్గో ఆపరేషన్‌లో ఈ కోర్సు ఉంటుందన్నారు. గ్రాడ్యుయేట్ అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విమానయాన రంగంపై ఆసక్తి కలిగిన వారికి సంబంధిత రంగంలో ఉద్యోగావకాశాలను కల్పించేందుకు దోహదం చేస్తుందని జీఎంఆర్ ఏరో ఎయిర్‌పోర్టు స్ట్రాటజీ ఇనిషియేటివ్ సీఈఓ ఆంద్రూ ఆక్వా హారిసన్ అన్నారు.

ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శిగా లక్ష్మి



రాజేంద్రనగర్: భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ) రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శిగా కన్యగారి లక్ష్మీ నియమితులయ్యారు. ఇటీవల భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రంగారెడ్డి జిల్లా 17వ మహాసభ మోయినాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా మండల పరిధిలోని బుద్వేల్‌కు చెందిన కన్యగారి లక్ష్మీ భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ) రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షురాలిగా జిల్లా సెంటర్ నుంచి జిల్లా కౌన్సిల్ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఎన్నికకు సహకరించిన రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు, పానుగంటి పర్వతాలు, కన్యగారి నర్సింహ్మారెడ్డి, ఎండీ రియాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కన్యగారి లక్ష్మీ మాట్లాడుతూ... మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.మునేశ్వరి, ఆర్.మౌనిక, కె.జ్యోతి, శాలిని, పద్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో కలిసి పాఠాలు వింటున్న డీఈఓ సుశీంధర్‌రావు

శంషాబాద్: శంషాబాద్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని సాతంరాయి జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడ జరుగుతున్న పాఠశాల భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అనంతరం పెద్దషాపూర్, పెద్దతూప్ర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి కూర్చుని ఉపాధ్యాయుల విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన తీరును పరిశీలించారు. టీచర్ డైరీలో విద్యార్థుల స్పందనలను తప్పకుండా టీచర్లు నమోదు చేయాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఫేస్ రికగ్నేషన్‌ను కూడా పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని సూచించారు. ఆయనతో మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మామిడి కిశోర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. సన్‌సిటీ ప్రాంతానికి చెందిన మోసిన్ హైమద్ ఖాన్ (36) ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 3న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన అతడి కుటుంబ సభ్యులు వెంటనే హైమద్ ఖాన్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు

ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై ఘటన

శంషాబాద్: ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డుపై ఎదురెదురుగా వాహనాలు ఢీ కొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. మంగళవారం సాయంత్రం గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళుతున్న వాహనాన్ని పట్టణంలోని వీఎస్ఆర్ ఫాంహౌస్ దగ్గర గచ్చిబౌలి వైపు వెళుతున్న ఎర్టిగా కారు ఢీ కొనడంతో రమ్య, మల్లిఖార్జున అనే వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరితో పాటు ఎర్టిగా కారు నడుపుతున్న విజయ్ అనే వ్యక్తికి కూడా గాయాలు కావడంతో పోలీసులు చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీవో కోసం ఎదురుచూపులు

ఎయిర్‌పోర్టులో ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి ఐదు నెలలు



ఆర్‌జీఐఏ ఔట్ పోస్టు పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం (ఫైల్)

- సాంకేతికంగా ఇంకా వేరుపడని పోలీస్‌స్టేషన్
- జీవో విడుదలైతేనే పోలీస్‌స్టేషన్‌గా గుర్తింపు
- ఒకే పోలీస్ స్టేషన్‌లోనే కొనసాగుతున్న రెండు పీఎస్‌లు

శంషాబాద్: పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్య, విమానాశ్రయ విస్తరణ.. ఏరోసిటీ ఏర్పాటు, పెరుగుతున్న నేరాల నియంత్రణ.. శాంతిభద్రత చర్యలు.. వీఐపీల బందోబస్తు కోసం రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రభుత్వం ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. గత మార్చి 1న సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి విమానాశ్రయంలోని టెర్మినల్ సమీపంలో ఆర్‌జీఐఏ ఔట్‌పోస్ట పోలీస్‌స్టేషన్ పేరుతో పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఐదు నెలలుగా పోలీస్‌స్టేషన్ తన కార్యకలాపాలు కొనసాగిస్తున్నా దానికి పూర్తి స్థాయిలో పోలీస్ స్టేషన్‌గా సాంకేతికంగా అనుమతి లభించలేదు. ఇందుకుగాను ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా జీవో విడుదల కావాల్సి ఉంది. ఆ తర్వాతే పూర్తి స్థాయి ప్రత్యేక పోలీస్‌స్టేషన్‌గా అవతరించి మరింత మెరుగైన సేవలందించేందుకు అవకాశమం ఉంటుంది.



శంషాబాద్ పట్టణంలోని ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్

2008లో ఆర్‌జీఐఏగా..

2008 మార్చిలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైంది. 2008 అక్టోబర్‌లో శంషాబాద్ పట్టణ కేంద్రంలో రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీస్ స్టేషన్ పేరుతో భౌగోళికంగా ఎయిర్‌పోర్టుతో పాటు శంషాబాద్ పట్టణం, రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగన్‌పహాడ్ రెవెన్యూ ప్రాంతాన్ని కలుపుతూ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. విమానాశ్రయానికి వచ్చే వీఐపీల రాకపోకల సమయంలో బందోబస్తుతో పాటు నకిలీ పాస్‌పోర్టులు, వీసాలు, ఫేక్ సర్టిఫికెట్‌లు, ప్రమాదాలు ఇతరత్రా అనేక కేసులతో దర్యాప్తుతో పాటు పట్టణానికి సంబంధించిన కేసుల దర్యాప్తు కూడా కొనసాగింది. గత నాలుగేళ్లుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు విస్తరణతో పాటు ప్రయాణికుల రాకపోకల సామర్థ్యం కూడా రెట్టింపయ్యింది. దీనికి తోడు విమానాశ్రయంలో ఏరోసిటీ, అనేక ప్రత్యేక సెజ్‌లుగా ఏర్పాటు కావడంతో వివిధ రకాల కేసులు కూడా పెరుగుతూ వచ్చాయి. ఎయిర్‌పోర్టులో జరిగే ప్రతి చిన్న సంఘటనకు బాధితులు శంషాబాద్ పట్టణానికి వచ్చి ఫిర్యాదు చేయడం భారంగా మారడంతో పోలీసులు కూడా ఉరుకులు..పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఉండడంతో ప్రభుత్వం ఎయిర్‌పోర్టులో ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు మొగ్గు చూపింది, ఈ నేపథ్యంలో ఇటీవల మిస్‌వరల్డ్ పోటీలకు ముందు ఎయిర్‌పోర్టు లోనే ప్రత్యేక పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించింది.

ఐదునెలల్లో నమోదైన కేసులు 200	
నకిలీపాస్‌పోర్టు, వీసాలు	60
ప్రమాదాలు	12
అదృశ్యం	08
నకిలీ విద్యార్హత సర్టిఫికెట్‌లు, నకిలీ టికెట్‌లు ఇతరత్రా కేసులు	120

జీవోతోనే గుర్తింపు..

ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్‌తో పాటు నలుగురు ఎస్సైలు, ఇతర సిబ్బంది మొత్తం 18 మంది ప్రత్యేక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. బాధితుల నుంచి వెంటనే ఫిర్యాదులు స్వీకరించినా పట్టణంలో ఉన్న పోలీస్‌స్టేషన్ ద్వారానే నేటికి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. రెండు పోలీస్‌స్టేషన్ల కేసులు ఒకే పోలీస్‌స్టేషన్ సీరియల్ నంబరులో కొనసాగుతున్నాయి. దీంతో సాంకేతికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జీవో వస్తే సిబ్బంది సంఖ్య పెరిగితే పోలీసుల సేవలు కూడా మెరుగుపడే అవకాశముంది. గత ఐదు నెలల్లో ఇప్పటి వరకు విమానాశ్రయం పోలీస్‌స్టేషన్‌లో 200 కేసులు నమోదయ్యాయి. జీవో రాకతో ప్రస్తుతం ఔట్‌పోస్టు పోలీస్ స్టేషన్‌గా కొనసాగుతున్నది ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌గా .. పట్టణంలో ఉన్న పోలీస్‌స్టేషన్ శంషాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌గా అవతరించనున్నాయి.

కేసుల దర్యాప్తులో వేగం పెరిగింది..

ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో బాధితులకు ఫిర్యాదు చేయడం సులువైంది. కేసుల పురోగతి కూడా మెరుగుపడింది. ప్రత్యేక పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన జీవో విడుదలకు సంబంధించిన కార్యాచరణ కొనసాగుతుంది. త్వరలోనే జీవో విడుదలయ్యే అవకాశముంది. విడుదల కాగానే ఎయిర్‌పోర్టు ఆవరణలో ప్రస్తుతం పోలీస్ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్‌గా ఉన్నది ఆర్‌జీఐఏగా.. పట్టణ పోలీస్‌స్టేషన్ శంషాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌గా పేర్లు మారతాయి. – శ్రీకాంత్‌గౌడ్, శంషాబాద్ ఏసీపీ

మాన్సూన్ టీమ్‌లు అప్రమత్తం...

24 గంటల పాటు సేవలు

అత్తాపూర్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కునేందుకు ప్రాంతాల వారీగా మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లు 24 గంటల పాటు సిద్ధంగా ఉన్నాయని మెట్రో వాటర్ బోర్డు అధికారులు పేర్కొన్నారు. వర్షాకాలంలో నాలాలు, డ్రైనేజీ పైపులైన్లు కూరుకుపోయి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలు కూడా తమకు సహకరించాలని కోరారు. వర్షాల కారణంగా ఎదురయ్యే సమస్యలపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు అధికారులు ప్రాంతాల వారీగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగామంగళవారం వాటర్ బోర్డు అత్తాపూర్ జనరల్ మేనేజర్ జవహర్ అలీ, మేనేజర్ శ్రావ్యరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అక్తర్, జావిద్ అలీ తదితరులు అత్తాపూర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఎక్కడ వరద, డ్రైనేజీ సమస్య తలెత్తిన వెంటనే పరిష్కరించేందుకు మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లు సిద్ధంగా ఉంటాయన్నారు. పలు ప్రాంతాల్లో నాలాలు, డ్రైనేజీ పైప్ లైన్‌లలో రాళ్లు, మద్యం సీసాలు, డైపర్‌లు తదితర వస్తువులను పారవేస్తున్నందున సమస్యలు తలెత్తుతున్నాయని, ఆయా ప్రాంతాల ప్రజలు ఈ విషయంలో విచక్షణ పాటించి అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు.



అత్తాపూర్‌లో పర్యటిస్తున్న వాటర్ బోర్డు జీఎం జవహర్ అలీ తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



కాలనీలో పర్యటిస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని, సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తున్నానని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానికుల కోరిక మేరకు డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్, శీలం కాలనీలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. సీసీ రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వర్షాల కారణంగా నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సీసీ రోడ్డు పనులకు ప్రతిపాదనలు రూపొందించి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ పైపులైన్ సరిగ్గా లేకపోవడంతో డ్రైనేజీ నీరు పొంగి పార్లుతున్నాయని నూతన పైపులైన్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, డివిజన్ అధ్యక్షుడు పాండుయాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి సూపర్‌వైజర్ లోకేనాథ్, శీలం శ్రీరాములు, మన్మోహన్‌రెడ్డి, శీలం లక్ష్మయ్య, మధుసూదన్‌రెడ్డి, అంజయ్య, రాజు, శీలం విజయ్, శ్రీకాంత్ రెడ్డి, శివయ్య, ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ మహేందర్, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

రాజేంద్రనగర్: వినాయక ఉత్సవాల సందర్భంగా పత్తికుంట, పల్లె చెరువుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సేవా సమితి అధ్యక్షులు వై.శ్రీధర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఉత్సవ సమితి ప్రతినిధులు, కమిటీ సభ్యులతో కలిసి రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాల సందర్భంగా రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి సర్కిళ్లలోని పత్తికుంట, పల్లె చెరువుల మరమ్మతులు, చెత్త చెదారం తొలగింపు, లైటింగ్ సదుపాయం, మండపాల వద్ద పరిశుభ్రత, భక్తులకు మంచినీటి సదుపాయం తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు.



డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

రాజేంద్రనగర్: ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కనిపించకుండా పోయిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మామిడి కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం. న్యూ ఫ్రెండ్స్ కాలనీకి చెందిన జి.శ్రీకాంత్ శర్మ (45) ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ నెల 4న డ్యూటీకి వెళ్లిన అతను తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

అక్రమ మట్టితవ్వకాలపై ఫిర్యాదు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని కొత్వాల్‌గూడ సర్వేనంబరు 75,76 లో భారీ ఎత్తున అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి వ్యాపారం చేస్తున్నారని మాజీ ఎంపీ తులసిరాం కుమారుడు, బీజేపీ సీనియర్ నాయకుడు విజయ్‌కుమార్ మంగళవారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, శంషాబాద్ డీసీపీ రాజేష్, తహసీల్దార్ రవీందర్ దత్‌కు ఫిర్యాదు చేశారు. కొత్వాల్‌గూడకు చెందిన యువకులు తనకు చెందిన భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారన్నారు. మట్టిని తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని ఆయన ఆర్‌జీఐఏ పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు.

రోడ్డు మరమ్మతుల కోసమే..

కొత్వాల్‌గూ వార్డుకు వచ్చే రహదారి పూర్తిగా దెబ్బతిన్నందున సీలింగ్ భూమిలోంచి మట్టిని తవ్వి గుంతలు పూడ్చి వేయించినట్లు కొత్వాల్‌గూడకు చెందిన రైతులు తహసీల్దార్ రవీందర్‌దత్ దృష్టికి తీసుకెళ్లారు. సర్వేనంబరు 75, 76లో రైతులకు సంబంధించిన 26 గుంటల భూమికి తాము హక్కుదారులమని తెలిపారు. గ్రామ రహదారి కోసం సొంత భూమిలో మట్టిని తరలిస్తే అడ్డుకోవడం సరైంది కాదన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ప్రేమ్‌రాజ్, దుర్గయ్య, యాదమ్మ, జనని తతదితరులు ఉన్నారు.



మట్టి తవ్వకాలు చేపట్టిన ప్రాంతం

తల్లిపాలు అమృతంతో సమానం



తల్లిపాల విశిష్టతను తెలియజేస్తున్న సీడీపీఓ కవిత

మణికొండ: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మూడేళ్ల వయసు వరకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని అవి అమృతంతో సమానమని, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ కవిత అన్నారు. మంగళవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట-1,2 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తు సమాజాన్ని ఆరోగ్యంగా నిర్మించాలంటే పిల్లలకు మంచి పౌష్టికాహారం, తల్లిపాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్య నియమాలను పాటిస్తే ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనిస్తారన్నారు. మొదటి ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలనే ఇవ్వాలన్నారు. తద్వారా రోగ నిరోధక శక్తి పెరిగి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గంగ, మీన, మంజులతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న టీచర్ అనిత

దబ్బా పాలు వద్దు... అమ్మ పాలు ముద్దు

మైలార్‌దేవ్‌పల్లి: పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా వారు ఎంతో ఆరోగ్యంగా ఉంటారని బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రం-2 టీచర్ అనిత అన్నారు. మంగళవారం బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రం-2 లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆగస్టు 1-7 వరకు ప్రపంచ వ్యాప్తంగా బ్రెస్ట్ ఫీడింగ్ వారోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. చిన్నారులకు రెండేళ్ల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మజ, కోమల్, హిమబింధు, అంగన్‌వాడీ హెల్పర్ సంగీత, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

శాస్త్రిపురం: వినాయక నవరాత్రి ఉత్సవాల ప్రారంభానికి ముందే బస్తీలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లలోని వినాయక మండపాల నిర్వాహకులు కోరుతున్నారు. ఈ నెల 27వ నుంచి వినాయక నవరాత్రులు ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతకు ముందే జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చింతల్‌మెట్, ఎన్‌టీఆర్‌నగర్, ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొనడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్తీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి ఎక్కడికక్కడ బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరారు. పలు ప్రాంతాల్లో మండపాలను ఏర్పాటు చేసే స్థలాల వద్ద మురుగునీరు ప్రవహిస్తుందని సంబంధిత అధికారులు మురుగునీరు రోడ్లపైకి రాకుండా మ్యాన్‌హోల్‌లను పూడిక తీయించాలని చింతల్‌మెట్ వాసులు కోరారు. రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు బస్తీల్లో పర్యటించి సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆదర్శ కాలనీ బస్తీ దవాఖానాలో ఆరోగ్య శిబిరం

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ కాలనీలో బస్తీ దవాఖానా ప్రాంగణంలో మంగళవారం ఆయుష్మాన్ భారత్ టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ పాపారావు పర్యవేక్షణలో స్థానిక ఇంటిగ్రేటెడ్ హెల్త్ సెంటర్(ఐహెచ్‌సీ) ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. షుగర్, హెచ్ఐవీ, ఎక్స్‌రే, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. టీబీ సూపర్‌వైజర్ ఎండీ రహీం మాట్లాడుతూ టీబీ పూర్తిగా నయమయ్యే వ్యాధి అని అన్నారు. దీనిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నరేష్‌కుమార్, టీబీ హెచ్‌బీ మధుబాబు, ఐసీటీసీ కౌన్సిలర్ గీతాలు, శ్రీనివాసులు, రమ్య, నాజిమ్మ, టీబీ అలర్ట్ ఇండియా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కిరణ అర్చన్ హెల్త్ సెంటర్ స్టాఫ్ నర్స్ జ్యోతిరవికుమార్, ఆయుష్మాన్ భారత్ బీడీ ప్రతినిధులు, ఆశావర్కర్లు లక్ష్మి, రూప, నాగవేణి, అనురాధ, స్థానికులు ఏర్వ కుమారస్వామి, అదేట్ల బాలు, దస బాలరాజ్, గోంత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బస్తీ వాసులు


సీసీ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

శంషాబాద్: పట్టణంలోని చెన్నమ్మ హోటల్ నుంచి కొత్వాల్‌గూడ వైఆర్‌రెడ్డి ఫాం హౌస్ వరకు హెచ్ఎండీఏ నిధులు రూ. 3.98 కోట్లతో చేపడుతున్న రహదారి పనులను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కొత్వాల్‌గూడ వాసులు ఇటీవల ఎమ్మెల్సీని కలిసి బస్తీ వరకు రహదారిని విస్తరించాలని కోరడంతో ఆయన నిధులు విడుదల చేయించారు. మరిన్ని నిధులు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్సీ వారికి హామీ ఇచ్చారు.

మౌలిక వసతులు కల్పించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బైరాగిగూడ కాలనీ వాసులు

బండ్లగూడ: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలని బైరాగిగూడ కాలనీ వాసులు అన్నారు. ఈ మేరకు మంగళవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా కాలనీలో నివాసం ఉంటూ పన్నులు చెల్లిస్తున్నా కాలనీల మధ్యలో డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్ లైట్ల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. దీనిపై పలుమార్లు ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల ప్రచారానికి మాత్రమే నాయకులు తమ కాలనీకి వస్తున్నారని సమస్యలపై శ్రద్ధ చూపడం లేదన్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం, రమేష్, ప్రసాద్, అశోక్, శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మురుగు నీటికి అడ్డుకట్ట వేయండి



చర్చి ఆవరణలో మురుగునీటిని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: జీహెచ్ఎంసీ పరిధిలోని కాలనీ, గేటెడ్ కమ్యూనిటీలకు చెందిన మురుగునీటి వ్యవస్థ సరిగా లేనందున మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఓ చర్చి ప్రాంగణంలోకి మురుగునీరు వచ్చి చేరుతుందని, సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బీఆర్ఎస్ మణికొండ మున్సిపాలిటీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు బెన్నీ ఆధ్వర్యంలో నాయకులు హుడాకాలనీ, భాగ్యలక్ష్మి కాలనీల మధ్య ఉన్న ది లైఫ్ చర్చిని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుడాకాలనీలోని అంబియన్స్ పోర్ట్ గేటెడ్ కమ్యూనిటీతో పాటు ఓయూ కాలనీకి చెందిన మురుగునీటి వ్యవస్థ సరిగా లేక మురికి నీరు చర్చి ప్రహరీలోకి వచ్చి చేరుతుందన్నారు. దాంతో చర్చికి వచ్చే వారితో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి వెంటనే మురుగు నీటికి అడ్డుకట్టవేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, ఉపాధ్యక్షుడు లక్ష్మన్‌రావు, అధికార ప్రతినిధి ఉపేంద్రనాథ్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు మాల్యాద్రి నాయుడు, ఆరీఫ్, కిరణ్, భానుచందర్, సుమ నళిని తదితరులు పాల్గొన్నారు.